క్లుప్తంగా...

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండికి చెందిన రాఘవేంద్ర రెండ్రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పద్మారావుగౌడ్ స్పందించి ఆస్పత్రి వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా సూచించారు. అదే విధంగా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి వైద్య ఖర్చులకు రూ.3 లక్షల ఎల్‌ఓసీని సమకూర్చి గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

డాక్టోరల్ కాన్‌క్లేవ్‌పై సదస్సు



మాట్లాడుతున్న ప్రొ.చెన్నప్ప

ఉస్మానియా యూనివర్సిటీ: పరిశోధనల కోసం అత్యాధునిక పద్ధతులను ఎంపిక చేసుకుని త్వరగా పూర్తి చేయాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం ఓయూ క్యాంపస్‌లోని కామర్స్ కాలేజీ ఆడిటోరియంలో డాక్టోరల్ కాన్‌క్లేవ్ -2023 అంశంపై సదస్సు జరిగింది. కామర్స్ హెడ్ ప్రొ.చెన్నప్ప, ప్రొ.సుధాకర్‌రెడ్డి, ప్రొ.అప్పారావు పాల్గొని ప్రసంగించారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా?

- బోర్డు నిర్లక్ష్యానికి బలవుతున్న అమాయకులు
- అక్రమార్కులకు అండగా నిలుస్తున్న కిందిస్థాయి సిబ్బంది
- స్థానిక నేతల ఒత్తిడితో చర్యలకు జంకుతున్న అధికారులు



ప్రమాదానికి కారణమైన స్విమ్మింగ్ పూల్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ,అధికారులు ధృతరాష్ట్ర పాలనను తలపిస్తున్నారు. సామాన్యులపై అపరిమితమైన ఆంక్షలు, నిబంధనల పేరిట వేధింపులకు పాల్పడుతూ.. అయినవారికి వారికి మాత్రం అన్నింటా మినహాయింపులు ఇస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి నిండుప్రాణాలు బలవుతున్నా తమకే మాత్రం సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతికి పరోక్షంగా కారకులైనా ఎంత మాత్రమూ బాధ్యత వహించడం లేదు. అక్రమార్కులకు బోర్డు సిబ్బంది సహకారంతో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. తాజాగా బోయిన్‌పల్లి పరిధిలోని ఓల్డ్ గ్రాంట్ బంగళా (బీ-3 స్థలం)లో అక్రమంగా కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్‌లో పడి ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు.

మచ్చుకు కొన్ని..

- ఆరు నెలల క్రితం ప్యారడైజ్ చౌరస్తా సమీపంలోని బాలంరాయి పంప్‌హౌజ్ క్లీనింగ్ విధుల్లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడు చనిపోయాడు. ఈ మృతికి తమకేమీ సంబంధం లేదంటూ బోర్డు అధికారులు చేతులెత్తేయగా బాధితుడి కుటుంబానికి ఎలాంటి పరిహారం దక్కలేదు.
- మూడు నెలల క్రితం బోయిన్‌పల్లిలో నిబంధనలకు విరుద్ధంగా ఓ కాంట్రాక్టు కార్మికుడిని నాలాలోకి దింపగా, ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు ఎంతగా ఆందోళన చేసినా బోర్డు అధికారులు మాత్రం స్పందించలేదు.
- కంటోన్మెంట్‌లో గరిష్ఠంగా మూడంతస్తులకు మించి నిర్మించడానికి అవకాశం లేదు. అలాంటి పరిస్థితుల్లో డైమండ్ పాయింట్ చౌరస్తా సమీపంలో ఏకంగా నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టారు. ప్రమాదవశాత్తూ ఓ కార్మికుడి నాలుగో అంతస్తు నుంచి జారిపడి చనిపోయాడు. ఈ విషయం బోర్డు అధికారుల దృష్టికెళ్లినా స్పందన లేదు. పైగా ఈ ఘటన తర్వాత జరిగిన బోర్డు సమావేశంలో సుమారు 30 అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. ఓ వ్యక్తి మృతికి కారణమైన భవనం మాత్రం ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం. ఓ మాజీ బోర్డు సభ్యుడి ఒత్తిడితోనే బోర్డు అధికారులు అక్రమార్కుడికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



నాలాలో పడి మృతి చెందిన కంటోన్మెంట్ కాంట్రాక్ట్ కార్మికుడు (ఫైల్)



అక్రమ నిర్మాణ పనుల్లో పట్టుతప్పి మృతి చెందిన కార్మికుడు (ఫైల్)

బీ-3 బంగళాల్లో అక్రమ వ్యాపారాలు

బ్రిటీష్ కాలంలో అప్పటి ప్రముఖులకు నివాస అవసరాల నిమిత్తం రక్షణ శాఖ స్థలాలను కేటాయించారు. ఓల్డ్ గ్రాంట్ బంగళాలుగా పరిగణించే ఈ బీ-3 స్థలాల క్రయ, విక్రయాలు, వ్యాపారాల నిర్వహణ నిషేధం. అయితే మెజారిటీ బంగళాలు అక్రమ మార్గంలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో పాటు పెద్ద ఎత్తున వ్యాపార కేంద్రాలుగా మారాయి. ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులోని జీఎల్‌ఆర్ సర్వే నెంబర్ 580లోని 6.32 ఎకరాల విస్తీర్ణంలో బంగళా నెంబర్ 169 ఉంది. ఈ బంగళా ఆక్రమణదారులకు ఆ స్థలంలో ఏకంగా ఓ ఫంక్షన్ హాలుతో పాటు, కమర్షియల్‌గా స్విమ్మింగ్‌పూల్, స్పోర్ట్ కాంప్లెక్స్ నిర్మించారు. బోర్డు నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే ఇక్కడ కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్‌లో ఐదేళ్ల క్రితం ఓ యవకుడు మృతి చెందగా, తాజాగా గురువారం సాయంత్రం మరో యువకుడు మృత్యువాత పడ్డాడు. ఇంత జరుగుతున్నా బోర్డు అధికారులు మాత్రం అటు వైపు కూడా కన్నెత్తి చూడకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం అంటు స్థానికులు మండిపడతున్నారు.

చర్యలు తప్పవు..

నిబంధనలకు విరుద్ధంగా ఓల్డ్ గ్రాంట్ బంగళాల్లో కొనసాగుతున్న కమర్షియల్ వ్యాపారాలపై చర్యలు తీసుకుంటాం. కంటోన్మెంట్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలకు పెద్ద సంఖ్యలో నోటీసులు ఇచ్చాం. త్వరలోనే ట్రేడ్ లైసెన్సు లేకుండా కొనసాగుతున్న వ్యాపారాలను మూసే వేయించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–మధుకర్ నాయక్, సీఈఓ

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ ఫ్రైడే మార్కెట్ ప్రాంతంలోని మార్కండేయనగర్ పార్కు పక్కనున్న జీహెచ్‌ఎంసీ ఖాళీ స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టనున్నట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. సంబంధిత అధికారులతో కలిసి గురువారం ఆమె స్థల పరిశీలన నిర్వహించారు. గ్రౌండ్ ప్లస్-2 అంతస్తుల్లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అనువుగా ఉన్నట్లు పరిశీలనతో తేలడంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్‌తో పాటు చిలకలగూడ యూపీహెచ్‌సీ భవనం, మిగిలిన రెండు అంతస్తుల్లో చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, షటిల్ బాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. బ్లూప్రింట్ రూపొందించిన అనంతరం పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ ప్రాజెక్ట్ డీఈఈ సుదర్శన్, ఏఈఈ సాయికృష్ణ, ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



కాంట్రాక్టు ఉద్యోగులతో చర్చిస్తున్న యూనియన్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ నాయకులు హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్ రాథోడ్ నేతృత్వంలో గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పీఆర్‌సీ జీవోలు 60, 63 అమలు, ఏజెన్సీల రద్దు, టెక్నికల్, నాన్‌టెక్నికల్ ఉద్యోగులకు సీనియారిటీ గుర్తింపు ఇవ్వాలని తీర్మానించారు. న్యాయమైన హక్కుల సాధనకు వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, ఆర్‌ఎంఓ-1 జయకృష్ణను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం శ్రీనివాస్, భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ రఫియుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్‌రాథోడ్ ప్రతినిధులు శాంతికుమార్, నర్సింగరావు, గాంధీ టీఎన్‌జీవో అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రక్త వాంతులు చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌కు చెందిన భాస్కర్ (37) కర్రీ పాయింట్ నడుపుతున్నాడు. గురువారం ఉదయం నుంచి భాస్కర్ రక్త వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే.. వడదెబ్బ తగలడంతోనే భాస్కర్ మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.


మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



మంత్రికి చేపలను అందజేసిన దృశ్యం

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నిండాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తూప్రాన్ మత్స్యకార సొసైటీ సభ్యులు ప్రతి సంవత్సరం తరహా మృగశిర కార్తె సందర్భంగా గురువారం మంత్రి శ్రీనివాస్ యాదవ్‌కు చేపలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకనే మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించడం జరిగిందన్నారు. నేడు చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయని, ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందన్నారు.మత్స్యకారులు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ డైరెక్టర్ దేవేందర్, సభ్యులు నర్సింగ్‌రావు, షాడ కోటేశ్వరరావు, పోచయ్య, చంద్రయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

ఎన్నికల తీరుతెన్నుల పరిశీలన



ఎన్నికల పనితీరుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలిస్తున్న ఎన్నికల బృందం

సికింద్రాబాద్: తెలంగాణ చీఫ్ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎన్నికల బృందం గురువారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ నమోదు, తప్పొప్పుల సవరణలు, అభ్యంతరాలు, చనిపోయిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. మహేశ్వరం మండల తహసీల్దార్ మహమ్మద్ అలీ, సిద్దిపేట జిల్లా అధికారులు సికింద్రాబాద్‌లో జరుగుతున్న ఎన్నికల పనులను పరిశీలించి, ఫారం-7, పీఎస్‌ఈలు, గార్డ్ ఫైళ్ల పరిశీలన ఏ విధంగా జరుపుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏఈఆర్వో హేమలత, సిద్దిపేట జిల్లా డిప్యూటీ ఎమ్మార్వోలు ఆలకుంట అశోక్, బండి రమేష్, రుక్మిణి రెడ్డి, సికింద్రాబాద్ ఎన్నికల విభాగం సెక్షన్ ఇన్‌చార్జి భుజేందర్, సీనియర్ అసిస్టెంట్ జయకృష్ణ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్

అడ్డగుట్ట: మహిళల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వాళ్లు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. గురువారం తుకారాంగేట్‌లోని కొండారెడ్డి నగర్‌లో మగ్గంవర్క్స్, కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. మహిళల సంరక్షణతో పాటు ఆర్థిక అభివృద్ధి కోసం ప్రధాని మోదీ అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చారని ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు ప్రాధాన్యం లేకుండా పోయిందన్నారు. మగ్గంవర్క్స్, కుట్టు శిక్షణలో కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ల ద్వారా కూడా ముద్ర రుణాలు పొందవచ్చని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నేతలు బండపల్లి సతీష్, ఆదం విజయ్‌కుమార్, కన్నాభిరాం, మేకల కీర్తి, మహేష్‌గౌడ్, ఉదయ్ యాదవ్, శివాజీ, సాయిబాబా, ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆవోపా బ్యాంక్‌మెన్ చాప్టర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2023లో తెలంగాణలో ఎంసెట్, నీట్, జేఈఈ, సివిల్స్‌లో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థుల నుంచి ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు కన్వీనర్లు టీఎల్‌వీ రావు, డాక్టర్ కొత్త రామానందం, అధ్యక్షులు పి.వి.రమణయ్యలు తెలిపారు. హైదరాబాద్ కాచిగూడలోని వైశ్య హాస్టల్ ఆడిటోరియంలో జూన్ 18న జరిగే కార్యక్రమంలో వారిని బంగారు పతకాలతో సన్మానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూన్ 14లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 92905 29133, 94419 28528లలో సంప్రదించాలని సూచించారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసు


సనత్‌నగర్: నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడుపుతున్న ఇద్దరిపై మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. మహంకాళి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ దీక్షిత్‌రెడ్డి బుధవారం సాయంత్రం పాత గాంధీ క్రాస్‌రోడ్డు వద్ద తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వర్తిస్తున్నారు. అదే సమయంలో సూర్యాపేట దాసాయిగూడెంకు చెందిన నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి (46), వరంగల్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమ్మడుగు గ్రామానికి చెందిన కొర్ర వినోద్‌కుమార్ (23) నెంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ పట్టుబడటంతో ఇరువురిని పై కేసు నమోదు చేశారు.

వైద్యుడంటూ రైల్లో పరిచయం

- బంగారు గొలుసు, ఫోన్‌తో పరార్

కంటోన్మెంట్: తనను డాక్టర్‌గా పరిచయం చేసుకుని తోటి రైలు ప్రయాణికురాలిని నమ్మించి బంగారు తొలుసుతో ఓ వ్యక్తి పారియాడు. గోపాలపురం పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఎలమ్మబండలో నివసించే నూకల సుజాత ఈ నెల 2వ తేదీ ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురంలో బంధువుల పెళ్లికోసం రైలులో బయలుదేరింది. తోటి ప్రయాణికుడు తాను నిమ్స్ డాక్టర్ అంటూ ఆమెతో పరిచయం చేసుకున్నాడు. బాధిత మహిళ తన అనారోగ్యం గురించి తెలుపగా, తిరుగు ప్రయాణంలో తనను సంప్రదిస్తే జబ్బు నయం చేస్తానంటూ నమ్మించాడు. బుధవారం ఉదయం రైలులో నగరానికి వచ్చిన సుజాతను ఫోన్‌లో సంప్రదించి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆమెను కలిశాడు. సమీపంలోని లాడ్జిలో చికిత్సకు అవసరమైన మందులు ఉన్నాయంటూ ఆమెను రెజిమెంటల్ బజార్‌లోని వినాయక లాడ్జికి తీసుకెళ్లాడు. సుజాతకు ట్యాబ్లెట్ ఇవ్వగా ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తేరుకుని చూసేసరికి ఆమె బ్యాగులో ఉన్న 10 గ్రాముల బంగారు గొలుసు, ఓ ఫోన్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిమ్స్ నూతన డైరెక్టర్‌కు సత్కారం



లక్డీకాపూల్: నిమ్స్ నూతన డైరక్టర్‌గా ప్రొఫెసర్ నగరి బీరప్ప నియామకం పట్ల ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గురువారం డైరెక్టర్ పేషీ ఉద్యోగ సంఘాల నాయకులతో కోలాహలంగా మారింది. ఇంచార్జి డైరెక్టర్‌గా బీరప్ప అందించిన సేవల పట్ల నిమ్స్ పాలక మండలి చైర్మన్ అయిన ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సంతృప్తిగా ఉన్నారనడానికి ఆయన నియామకాల్లో పేర్కొనవచ్చు. నిమ్స్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ. 1615 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపడుతున్న తరుణంలో ఈ నియామకం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే తల్లి పిల్లల ఆస్పత్రి భవన సముదాయానికి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

రహమత్‌నగర్: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధిపులకు పాల్పడ్డ బీజేపీ ఎంపీ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, చట్ట పరంగా కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు నిరసనగా గురువారం ఎస్పీఆర్‌హిల్స్‌లో సీఐటీయూ నేతలు ఆందోలన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జూబ్లీహిల్స్ కన్వీనర్ స్వామి మాట్లాడుతూ... దేశ కీర్తి పతాకాన్ని ప్రపంచానికి చాటిన మహిళా రెజ్లర్లపై ఎంపీ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భూషణ్‌ను అరెస్టు చేయకుండా వెనకేసుకురావడం శోచనీయమన్నారు. సీపీఎం నాయకుడు రాపర్తి అశోక్, ఎ.ఆర్.నరసింహా, భాగ్యరాజ్, బాలయ్య, సిద్ధూ, మహిళ నాయకురాళ్లు సమాధానం, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చే అన్నపూర్ణను కూల్చేశారు!

- ఆక్రమణల పేరుతో రూ. 5 భోజన కేంద్రం తొలగింపు
- పక్కకు జరిపే క్రమంలో ధ్వంసమైందంటున్న అధికారులు
- మళ్లీ పునరుద్ధరిస్తామని వెల్లడి



ధ్వంసమైన క్యాంటీన్

సనత్‌నగర్: అక్కడ రోజుకు 200 నుంచి 250 మంది వరకు ఆకలి తీర్చుకుంటారు. రూ.5కు 'టీ' కూడా దొరకని ఈ రోజుల్లో అన్నపూర్ణ క్యాంటీన్ల వద్ద అదే రూ.5కు కడుపు నిండా భోజనం దొరుకుతుంది. నిత్యం అన్నం పెట్టే ఆ అన్నపూర్ణ క్యాంటీన్‌ను సైతం ఆక్రమణల సరసన జతకట్టి కూల్చివేయడం గమనార్హం. సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలో లోధా అపార్ట్‌మెంట్ ముందు ప్రధాన రహదారిలో గత ఐదేళ్లుగా అన్నపూర్ణ క్యాంటీన్ కొనసాగుతోంది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలు కాగానే ఇక్కడి కేంద్రం ముందు బారులు తీరుతుంటారు. రోజువారీ కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులు అక్కడ ఆగి రూ.5 లతోనే ఆకలి తీర్చుకుని యథావిధిగా తమ తమ పనులకు వెళ్లిపోతుంటారు. ఇలా రోజుకు 250 మంది వరకు అన్నపూర్ణ క్యాంటీన్‌ను ఆశ్రయిస్తుంటారు.

వెనుదిరుగుతున్న అన్నార్తులు..

అయితే ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ లోధా అపార్ట్‌మెంట్స్ ముందు ఫుట్‌పాత్ ఆక్రమణలను పరిశీలించి వాటిని తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు సిబ్బంది బుధవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించే క్రమంలో అన్నపూర్ణ కేంద్రం డబ్బాను సైతం తొలగించారు. రోజూ లాగానే గురువారం కూడా రూ.5 భోజనానికి వంటకాలు తీసుకుని సిబ్బంది అక్కడకు రాగా డబ్బా కూలిపోయి ఉండడంతో అవాక్కయ్యారు. దీంతో చేసేదేమీ లేక వంటకాలను తీసుకు వెళ్లిపోయారు. అలాగే ఇక్కడ భోజనం చేసేందుకు వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా.. అన్నపూర్ణ క్యాంటీన్ డబ్బాను పక్కకు జరిపే ప్రయత్నంలో ధ్వంసమైందన్నారు. అప్పటికే శిథిలావస్థలో ఉండడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు చెప్పుకొచ్చారు. డబ్బాను మళ్ళీ పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రోజూ ఇక్కడే ఆకలి తీర్చుకుంటాను..



నేను రోజువారీ కూలీని. ప్రతిరోజూ రూ.5లకే ఇక్కడ భోజనం చేసి పని వెళ్తుంటాను. రోజులాగే ఇక్కడకు వచ్చి చూస్తే అన్నం పెట్టే డబ్బా ధ్వంసమై ఉండడం కనిపించింది. దీంతో ఎక్కువ డబ్బులు పెట్టి బయట ఆకలి తీర్చుకోవాల్సి వచ్చింది.

–అహ్మద్, రోజువారీ కూలీ

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: ఆటో డ్రైవర్ల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపేందుకు ఉన్నత స్థాయి కమిటీ వేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. ఐఏఎస్ అధికారి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి రవాణా శాఖ అధికారులను అందులో భాగస్వామ్యం చేయాన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ... నిరంతరం ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు పెచ్చు పెరిగిపోతున్నాయన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆటోలు కొనుగోలు చేసి జీవనం సాగించేందుకు జాతీయ బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని విన్నవించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను రూ. 40కు పెంచాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ఉచితంగా ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రవాణా శాఖలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. నగరంలోనూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని రవాణా శాఖ ట్రాఫిక్ పోలీసులకు రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు.

గౌడ బంధును ప్రకటించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం ప్రకటించిన ఏ పథకంలోనూ గౌడ్‌లు, కల్లుగీత వృత్తిదారుల ప్రస్తావన లేకపోవడం బాధాకరమని, తక్షణమే గౌడ బంధును ప్రకటించి ప్రతి గౌడ కులానికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐయిలి వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రభుత్వం పది బడ్జెట్‌లు ప్రవేశపెడితే ఏ బడ్జెట్‌లోనూ ఒక్క పైసా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌడల సంక్షేమాన్ని విస్మరించిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని అసలు గౌడలు బీసీలు కాదా అని అన్నారు. గౌడలను విస్మరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఒక్క ఎమ్మెల్సీ, రాజ్యాసభ ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2014లో కార్పొరేషన్‌ను రద్దు చేసి బీసీ కార్పొరేషన్‌లో విలీనం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని విమర్శించారు.